

ప్రజాశక్తి

ఆదివారం 19 జనవరి 2025



టిటిపిఆర్ ఎస్ఇగా స్వర్ణ కుమార్



ప్రజాశక్తి- విజయనగరం

సర్దార్ గౌతులచ్చన్న తోటపల్లి ప్రాజెక్ట్ పర్యవేక్షక ఇంజనీర్ గా కెవి ఎన్ స్వర్ణ కుమార్ శనివారం బాధ్యతలు చేపట్టారు. తారకరామ తీర్థసాగరం ప్రాజెక్టుకు కూడా ఆయన ఎస్ఇగా వ్యవహరిస్తారు. ఇప్పటి వరకు ఆయన శ్రీకాకుళం జిల్లాలో వంశధార ప్రాజెక్టు ఎస్ఇగా చేశారు. ఈ మేరకు ఆయన విజయనగరం జిల్లా కలెక్టర్ డాక్టర్ బి ఆర్ అంబేద్కర్‌ను మర్యాద పూర్వకంగా శనివారం కలిశారు. బొబ్బిలి సర్కిల్ జల వనరుల శాఖ ఎస్ఇగా ఆర్.అప్పారావు నియమితులయ్యారు.

జ్యూట్ కార్మికులకు ఇచ్చిన హామీ ఏమైందో..?

- టిడిపి కూటమి అధికారంలోకి వచ్చి ఏడు నెలలు
- మిల్లు తెరిపించేందుకు ముందుకు పడని అడుగు

ప్రజాశక్తి - సాలూరు

పార్వతీపురం మన్యం జిల్లాలో గల ఏకైక పరిశ్రమ మూతపడి మూడేళ్లు దాటిపోయింది. గత ప్రభుత్వం అనుసరించిన దారిలోనే ప్రస్తుత కూటమి ప్రభుత్వం కూడా నడుస్తోంది. అధికారంలోకి వచ్చి ఏడు నెలలు కావస్తున్నా జీగిరాం జూట్ మిల్లు తెరిపించేందుకు ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదు. సుమారు 1800 మంది కార్మికులు పని చేస్తున్న జూట్ మిల్లును తాము అధికారంలోకి వస్తే తెరిపిస్తామని సాక్ష్యాత్తూ ప్రస్తుత విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఎన్నికల ప్రచారంలో హామీ ఇచ్చారు. అంతకు ముందు నియోజకవర్గ ఎన్నికల ప్రచారంలో గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సంధ్యారాణి కూడా జ్యూట్ కార్మికులున్న గ్రామాల్లో హామీ ఇచ్చారు. అయితే టిడిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత జూట్ మిల్లు తెరిపించేందుకు మంత్రి సంధ్యారాణి చేసిన ప్రయత్నాలేమీ లేవు. కనీసం మిల్లు యాజమాన్య ప్రతినిధులను పిలిచి చర్చించిన దాఖలాల్లేవు. వైసిపి ప్రభుత్వ హయాంలో అప్పటి మంత్రి రాజన్నదొర యాజమాన్య ప్రతినిధులు, కార్మిక సంఘాల నాయకులతో చర్చలు జరిగేలా ప్రయత్నించారు. కానీ ప్రస్తుత జిల్లా మంత్రి ఆ ప్రయత్నం కూడా చేయడం లేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. టిడిపి ప్రభుత్వంపై కార్మికులు పెట్టుకున్న ఆశలు ఆవిరయ్యే పరిస్థితి కనిపిస్తోంది. మూడేళ్లుగా జ్యూట్ మిల్లు మూత పడడంతో కార్మిక కుటుంబాలు అర్థాకలితో అలమటిస్తున్నాయి. ఉద్యోగాలే జీవనాధారం అనుకున్న కార్మికులు వ్యవసాయ కూలీలుగా మారి జీవనం సాగిస్తున్నారు. కొంతమంది బతుకు తెరువు కోసం దూరప్రాంతాలకు వలస పోయారు.



మూతపడ్డ జీగిరాం జ్యూట్‌మిల్

ఓటు వేశాక బోడి మల్లయ్య చందంగా

రాజకీయ పార్టీలు జీగిరాం జూట్ మిల్లును ఎన్నికల ప్రచార అస్త్రంగా వాడుకుంటున్నాయి. ఎన్నికల ముందు వరకు లేనిపోని హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ హామీలను గాలికొదిలేయడం ప్రధాన రాజకీయ పార్టీలకు అలవాటుగా మారింది. సుమారు మూడు వేల ఓట్లు ఉన్న జూట్ మిల్లును తెరిపించే విషయంలో అధికార, ప్రతిపక్ష పార్టీలు రెండూ దొందూ దొందే అన్న చందంగా వ్యవహరిస్తున్నాయి. ఓటు అవసరం తీరిన తరువాత కార్మికులను బోడి మల్లయ్య అన్న చందంగా పాలకులు చూస్తున్న పరిస్థితి కనిపిస్తోంది.

పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత : కలెక్టర్

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం/గరుగుబిల్లి

మన చుట్టుప్రక్కల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం మన అందరి బాధ్యతని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ అన్నారు. శనివారం జియమ్మ వలస మండలం కుదమ పంచాయతీ పెదకుదమలో ఏర్పాటు చేసిన స్వర్ణ ఆంధ్ర- స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోనే పార్వతీపురం మన్యం జిల్లాను పరిశుభ్రమైన జిల్లాగా మొదటి స్థానంలో నిలపాలనే లక్ష్యంతో అధికారులు పని చేయాలని సూచించారు. ప్రతి నెలా మూడో శనివారం స్వర్ణ ఆంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం చేపట్టాలని ప్రభుత్వం ఆదేశించిందని పేర్కొన్నారు. స్వర్ణ ఆంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని ప్రభుత్వ కార్యాలయాలు, నివాసిత ప్రాంతాలు, గ్రామ పంచాయితీలు, మున్సిపాలిటీలు, పాఠశాలలు, ఆసుపత్రులు, బస్టాండ్‌లు, రైల్వేస్టేషన్లు, బజార్లు తదితర ప్రదేశాల్లో స్వచ్ఛ ఆంధ్రా కార్యక్రమం ద్వారా శుభ్రపరచాలని, స్వర్ణ జిల్లాగా తీర్చిదిద్దాలని కోరారు. తడి, పొడి చెత్తను వేరు చేసి ఎప్పటికప్పుడు మున్సిపల్ సిబ్బందికి అందజేయాలని కలెక్టర్ సూచించారు. భవిష్యత్ తరాలకు స్వచ్ఛ పరిసరాలను అందించే లక్ష్యంతో పని చేయాలన్నారు. ప్లాస్టిక్ ఉపయోగంపై ప్రతి ఒక్కరికీ అవగాహనా ఉండాలని, ప్లాస్టిక్ రహిత జిల్లాను నిర్మించే దిశగా అడుగులు వేయాలని కలెక్టర్ తెలిపారు. ఒక్కో నెల ఒక్కో థీమ్‌తో స్వర్ణ ఆంధ్ర-స్వచ్ఛ ఆంధ్ర ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు కలెక్టర్ తెలిపారు. వీధుల్లో చెత్తను వేయవద్దని కోరారు. మురుగు కాలువలు ఎప్పటికప్పుడు శుభ్రం చేసి, బ్లీచింగ్ చల్లాలని పురపాలక సిబ్బందిని కలెక్టర్ ఆదేశించారు. ఈ సందర్భంగా గ్రామంలో పారిశుధ్యం, కాలువలు, తాగునీటి పైపు లైన్లు తదితర అంశాలను కలెక్టర్ పరిశీలించారు. కార్యక్రమంలో డ్వామా పీడీ కె.రామ చంద్ర రావు, స్థానిక అధికారులు, ప్రజా ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

గరుగుబిల్లి : మండలంలోని తోటపల్లి జట్టు సంస్థ కార్యాలయ ప్రాంగణంలో స్వచ్ఛ సుందర పార్వతీపురం మన్యం జిల్లా మాస్టర్ ట్రైనీస్ శిక్షణా కార్యక్రమాన్ని కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ ప్రారంభించారు. జట్టు వ్యవస్థాపకులు డాక్టర్ డి. పారినాయుడు అధ్యక్షతన జిల్లాలోని వందమంది మాస్టర్ ట్రైనర్లకు పది రోజులు శిక్షణ ఇవ్వనున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ శిక్షణా కార్యక్రమం రాష్ట్ర వ్యాప్తంగా ప్రారంభించారని ఇందులో భాగంగా మన జిల్లాలో ఈ శిక్షణా కార్యక్రమం ప్రారంభించామని చెప్పారు. పర్యావరణ పరిరక్షణలో సామాజిక భాగస్వామ్యాన్ని ప్రోత్సహించడం, ప్రజారోగ్య పరిరక్షణకు పరిశుభ్రమైన వాతావరణంపై ప్రజల్లో అవగాహన కల్పించడం, చెత్తకుప్పలు తొలగింపు, తాగునీటి వసతులలో క్లోరినేషన్ మురుగు కాలువలు శుభ్రం చేయడం, చెరువులు వద్ద చెత్త లేకుండా చూడ్డం, తడి చెత్త పొడి చెత్త వేరు చేయడం, వాటిని రీసైక్లింగ్, ప్రాసెసింగ్ ప్రక్రియ కొనసాగించడం, చెత్త నుండి సంపద సృష్టించడం మొదలైన కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. దీనికోసం మాస్టర్ ట్రైనర్స్ కృషి చేయాలన్నారు. ఈపది రోజుల ఈ శిక్షణలో బాగా నేర్చుకుని గ్రామాల్లో 80 రోజులు ప్రత్యక్షంగా సుందర గ్రామాల రూపకల్పనలో పనిచేయాలన్నారు. అప్పుడు పని అనుభవం, వారి నైపుణ్యాలను గుర్తించి పరీక్ష పెడతామని అందులో ఎంపికైన వారిని కార్యకర్తలుగా నియమించి గౌరవ వేతనం చెల్లిస్తామని స్పష్టం చేశారు. అనంతరం స్వచ్ఛ రాష్ట్ర సలహాదారు శ్రీనివాసచార్యులు శిక్షణను అందించారు. కార్యక్రమంలో నాబార్డ్ డీడీఎం సాధు దినేష్ రెడ్డి, సెట్విజ్ సిఇఒ రాంగోపాల్, జట్టు భావన సమైక్య ఆశ్రమ నిర్వాహకులు పద్మజ, డిఎండబ్ల్యూఎస్ స్వచ్ఛంద సేవ వ్యవస్థాపకులు శాంతి, జట్టు సిబ్బంది, మాస్టర్ ట్రెయినీలు పాల్గొన్నారు.



కుదమలో రోడ్లు ఊడ్చుతున్న కలెక్టర్ శ్యామ్ ప్రసాద్

జీడిపిక్కలు క్వింటా రూ.18వేలకు కొనుగోలు చేయాలి

సిపిఎం డిమాండ్

ప్రజాశక్తి -గుమ్మలక్ష్మీపురం

జీడి పిక్కలు క్వింటాల్ రూ.18 వేలకు కొనుగోలు చేయాలని, జీడి ప్రాసెసింగ్ యూనిట్లు పెట్టి యువతకు ఉపాధి కల్పించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి కొల్లి గంగు నాయుడు డిమాండ్ చేశారు. శనివారం స్థానిక గిరిజన సంఘం కార్యాలయంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ఎం.రమణతో కలిసి విలేకర్లతో మాట్లాడారు. జీడిపిక్కల ధర మార్కెట్లో కేజీ రూ.180 వరకు పలుకుతోందని, తీరా గిరిజనుల చేతికి పంట వచ్చే సమయానికి వంద రూపాయలు కంటే ఎక్కువ ధరకు కొనుగోలు చేయడం లేదని అన్నారు. సీతంపేట, కురుపాం, గుమ్మలక్ష్మీపురం, సాలూరు గిరిజన ప్రాంతాల్లో ఆహార పంటలు, సాంప్రదాయ పంటలు స్థానంలో జీడిపంట వేశారని, దీంతో ఈ పంట పండకపోయినా, ధర లేకపోయినా గిరిజనులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పుడు కేజీ జీడిపిక్కల ధర రూ.180 పలుకుతుందని, పంట చేతికి వచ్చేసరికి వ్యాపారస్తులంతా కుమ్మక్కైపోయి గిరిజనులకు ధర రాకుండా చేస్తున్నారని, అయినా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం చొరవచూపి అక్రమార్కులను అరికట్టి గిరిజనులకు న్యాయమైన ధర వచ్చేలా చూడాలని, క్వింటా జీడిపిక్కలు రూ.18వేలకు జిసిసి ద్వారా ప్రభుత్వమే కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. గిరిజన యువత ఉపాధి లేక పట్టణ ప్రాంతాలకు వలసలు వెళ్లి ఇబ్బందులు పడుతున్నారని, జీడి ప్రాసెసింగ్ యూనిట్లు పెట్టి యువతకు ఉపాధి కల్పించి గిరిజనులకు న్యాయమైన ధర వచ్చేలా చర్యలు చేపట్టాలని కోరారు. లేకుంటే రానున్న రోజుల్లో గిరిజనులందర్నీ కదిలించి పెద్ద ఎత్తున ప్రభుత్వం పై ఆందోళన చేస్తామని హెచ్చరించారు.



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న గంగునాయుడు

అరకొర పనులపై సబ్ కలెక్టర్ అసంతృప్తి

- 24 నాటికి పనులు పూర్తి కావాలి
- పిఆర్ ఎఇ రాకపోవడంతో ఆగ్రహం

ప్రజాశక్తి - మక్కువ

మండలంలోని రాష్ట్ర జాతరగా గుర్తింపు పొందిన పోలమాంబ అమ్మవారి జాతర సమయం సమీపిస్తున్నప్పటికీ పంచాయతీరాజ్ ద్వారా చేపట్టే అభివృద్ధి పనులు అసంపూర్తిగా ఉండడంపై పార్వతీపురం సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాత్సవ్ అసంతృప్తి వ్యక్తం చేశారు. శనివారం మధ్యాహ్నం ఆయన శంబరలోని పోలమాంబ ఆలయ పరిసరాల్లో జరుగుతున్న పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా వనం, చదురు గుడుల వద్ద రహదారుల నిర్మాణం, సిరిమాను తిరిగే రహదారితో పాటు కాలువల పనులను ఆయన పరిశీలించారు. గోముఖీ నది ఒడ్డున ఏర్పాటు చేసిన ప్లాట్‌పారం నుండి నిర్మించిన మెట్లను కూడా పరిశీలించారు. మెట్లు నిర్మించిన తీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు. అలాగే క్యూలైన్ నుంచి చదురు గుడికి వెళ్లే రోడ్డు మధ్యలో మెట్లు ఎందుకు నిర్మించలేదని సంబంధిత కాంట్రాక్టర్‌ను, సిబ్బందిని ప్రశ్నించారు. సిరిమాను తిరిగే ప్రదేశంలో రహదారికి ఇరువైపుల నిర్మించిన కాలువలపై ఎందుకు సిమెంట్ దిమ్మలు వేయలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. పనులు చేసేందుకు వేతనదారులు లేకపోవడంతో పనులు జాప్యంగా జరుగుతున్నాయని కాంట్రాక్టర్ తరపు సిబ్బంది సబ్ కలెక్టర్‌కు వివరించారు. ఏది ఏమైనా ఈనెల 24 నాటికి 90 శాతం పనులు పూర్తి కావాలని ఆదేశించారు. అలాగే విద్యుత్ స్తంభాలు ఇంకా పలుచోట్ల ఎందుకు తొలగించలేదని ఆ శాఖ సిబ్బందిపై అసహనం వ్యక్తం చేశారు. వాటిని వెంటనే తొలగించాలని సూచించారు

నాకేమైనా పని లేక వచ్చానా...!

పంచాయతీరాజ్‌శాఖ చేడుతున్న పనులు వివరాలను తెలిపేందుకు అందుబాటులో ఉండాలని సంబంధిత అధికారులకు సమాచారం ఇచ్చినప్పటికీ రాకపోవడంతో సబ్ కలెక్టర్ ఆశతోష్ శ్రీవత్సవ ఆగ్రహం వ్యక్తం చేశారు. నాకేమైనా పని లేక ఇక్కడికి వచ్చాను అనుకుంటున్నారా అని ఆయన అసహనం వ్యక్తం చేశారు. దేవాలయ శాఖ చేపడుతున్న పనులను ఇఒ వివి సూర్యనారాయణను అడిగి తెలుసుకున్నారు. మళ్లీ ఈనెల 24న ఇక్కడికి వస్తానని అప్పటికి అన్ని పనులు పూర్తి కావాలని ఆయన ఆదేశించారు. కార్యక్రమంలో తహశీల్దార్ షేక్ ఇబ్రహీం, ఎంపిడిఒ డివి స్వరూపరాణి, ఉప సర్పంచ్ అల్లు వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.



గోముఖీ నది ఒడ్డున నిర్మించిన మెట్లను పరిశీలిస్తున్న సబ్‌కలెక్టర్ అశుతోష్‌శ్రీవాస్తవ

రైతుల గోడు ఎంపీలకు వినిపించేనా?



ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

రైతుల గోడు ఎంపీలకు వినిపించేనా? లేక తెలియనట్టు నటిస్తారా? అన్న చర్చ ఉమ్మడి విజయనగరం జిల్లాలో సర్వత్రా సాగుతోంది. ఇందుకు కారణం లేకపోలేదు. ఎపికి ప్రత్యేక హోదా మొదలుకుని విభజన చట్టంలోని అనేక హామీలు అమలు కాకపోవడంతో రాష్ట్రంలోని అన్ని జిల్లాల కన్నా మన జిల్లాయే ఎక్కువగా నష్టపోయింది. వెనుక బడిన జిల్లాకు ఇస్తామన్న ప్యాకేజీ మిగిలిన జిల్లాలతో పాటు మనకూ కేంద్రం ఎగ్గొట్టింది. ఇలా గడిచిన పదేళ్లుగా కేంద్రంలో అధికారం చెలాయిస్తున్న బిజెపి ప్రభుత్వం జిల్లాను నిర్లక్ష్యానికి గురిచేసింది. ఈ సంగతి కాస్త అటుంచితే, తాజాగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తమ సమస్యలు పరిష్కారం చేయాలని డిమాండ్ చేస్తూ ఢిల్లీ నుంచి గల్లీ వరకు రైతులు ఆందోళన చేస్తున్నారు. వ్యవసాయ మార్కెట్‌పై ప్రవేశపెట్టిన జాతీయ ముసాయిదాను ఉపసంహరించుకోవాలని, అందుకోసం ఢిల్లీలో దీక్షలు చేస్తున్న రైతు నాయకుల ప్రాణాలను పరిరక్షించాలని సంయుక్త కిసాన్ మోర్చ (ఎస్‌కెఎం) పోరాడుతున్న సంగతి తెలిసిందే. ఆయా డిమాండ్లతోపాటు రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను కూడా అమలు చేయాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వం రైతు భరోసా పేరిట రూ.13,500 వేలు ఇవ్వగా, తాము అధికారంలోకి వస్తే రైతులకు పెట్టుబడి సాయం కింద ఏటా రూ.20 వేలు అందిస్తామంటూ టిడిపి కూటమి ప్రకటించింది. దీన్ని గడిచిన ఖరీఫ్ సీజనల్‌లో కూడా అమలు చేయకపోవడంతో రైతులు ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొన్నారు. మరోవైపు వరి, మొక్కజొన్న, చెరకు, పత్తి వంటి వ్యవసాయ ఉత్పత్తుల ధరలు మాత్రం మొక్కుబడిగానే పెంచారు. ఇది చాలదన్నట్టు బీమా ప్రీమియాన్ని కూడా రైతులపైకే నెట్టారు. మన జిల్లాలో వరి, పెసలు, మినుములు, మొక్కజొన్న పంటలకు మాత్రమే బీమా సదుపాయాన్ని వర్తింపజేశారు. ఎకరా వరికి రూ.630, మొక్కజొన్నకు రూ.540, మినుములు పెసలు రూ.300 చొప్పున ప్రీమియం విధించారు. మునుపెన్నడూ లేనంతగా ప్రీమియం విధించారని, ఈ భారాన్ని ప్రభుత్వమే మోయాలని, తాము ప్రీమియం చెల్లిస్తే ప్రభుత్వం తమకు చేసేదేముందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇటు పెరిగిన పెట్టుబడులు, పెరగని వ్యవసాయ ఉత్పత్తుల ధరల వల్ల అప్పుల ఊబిలో కూరుకుపోయిన నేపథ్యంలో రూ.2 లక్షల వరకు పంట రుణాలు మాఫీ చేయాలని కర్షకులు డిమాండ్ చేస్తున్నారు. ఎరువుల ధరలు కూడా తగ్గించకపోతే వ్యవసాయం చేసే పరిస్థితులు కోల్పోతామని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో సుమారు 80 వేల నుంచి 90 వేల వరకు కౌలు రైతులు ఉండగా, ప్రభుత్వం కేవలం 16వేల మందికే గుర్తింపు కార్డులు ఇచ్చింది. భూ యజమానుల సంతకాలతో లింకు పెట్టడం వల్ల రుణాలకు నోచుకోలేకపోతున్నామని రైతులు చర్చించుకుంటున్నారు. పాలు, ధాన్యం విక్రయాలపై బోనస్‌కు నోచుకోలేకపోతున్నామని రైతుల ఆవేదన. రైతులు పండించే అన్ని పంటలకు సి 2 ప్లస్ 50 శాతం ఫార్ములా ప్రకారం మద్దతు ధరలకు చట్టబద్ధత కల్పించాలని, సాగునీటి ప్రాజెక్టులకు తగినంతగా కేటాయించాలని కూడా రైతులు డిమాండ్ చేస్తున్నారు. ఈ నేపథ్యంలో చేపట్టిన నిరసన కార్యక్రమాల్లో భాగంగా నేడు (ఈ నెల 19న) కార్మిక, కర్షక ఐక్యతా దినంగా పాటిస్తూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతులపై చూపుతున్న నిర్లక్ష్యాన్ని ఎండగడుతూ ఆందోళన కార్యక్రమాలు చేపట్టనున్నారు. 20న విజయనగరం, అరకు జిల్లాలకు చెందిన ఎంపీల ఇళ్లు, కార్యాలయాలను ముట్టడించేందుకు రైతులు, రైతు సంఘం నాయకులు సన్నద్ధమౌతున్నారు.

కేంద్రం వైఖరి దుర్మార్గం : ఎస్‌కెఎం

ప్రజాశక్తి- పార్వతీపురం

రైతాంగం ఎదుర్కొంటున్న సమస్యల పట్ల కేంద్ర ప్రభుత్వ వైఖరి చాలా దుర్మార్గంగా ఉందని రైతు సంఘాల సమన్వయ కమిటీ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు శనివారం స్థానిక ఐఎఫ్‌టియు కార్యాలయంలో ప్రగతిశీల మహిళా సంఘ నాయకులు పి. రమణి అధ్యకతన జరిగిన సమావేశంలో రైతు సంఘాల సమన్వయ కమిటీ జిల్లా కన్వీనర్ బంటు దాసు, అఖిల భారత రైతు కూలీ సంఘం నాయకులు బొత్స నర్సింగరావు, రైతు కూలీ సంఘం ఆంధ్రప్రదేశ్ నాయకులు పి.శ్రీనునాయుడు, ఎమ్ భాస్క్రరావు (భాష), ఏపి రైతు సంఘం నాయకులు ఈ.వి నాయుడు, గిరిజన సంక్షేమ సంఘం నాయకులు పాలక రంజిత్ కుమార్, అయ్యార్ల సంఘం నాయకులు పి. సంఘం, కాంగ్రెస్ నాయకులు వి.దాలినాయుడు మాట్లాడుతూ రైతులకు, వ్యవసాయానికి నష్టం చేసే నల్ల చట్టాలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ప్రాణాలను పణంగా పెట్టి రైతు సమస్యల పరిష్కారం కోసం పోరాటం జరుగుతున్నా కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలనీ డిమాండ్ చేశారు. జనవరి 26న దేశావ్యాప్తంగా జరుగుతున్న నిరసనలో భాగంగా అదే రోజు పార్వతీపురంలో 'నిరసన ప్రదర్శన' నిర్వహిస్తామని తెలిపారు. పార్వతీపురం పాత బస్టాండ్ నుంచి జిల్లా కలెక్టర్ కార్యాలయం వరకు జరిగే ప్రదర్శనలో రైతాంగం, రైతు కూలీలు, అన్ని వర్గాల ప్రజలు పాల్గొని నిరసన ప్రదర్శనను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో నాయకులు కె.కిరణ్, ఎస్. సాయి శ్రీనివాస్, కె.సన్నిబాబు, ఎ.కన్నారావు తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శ ప్రాయుడు ఎన్‌టిఆర్



ఎన్‌టిఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళ్లు అర్పిస్తున్న మంత్రి సంధ్యారాణి

ప్రజాశక్తి - సాలూరు

తెలుగు రాష్ట్ర రాజకీయాల్లో కొత్త ఒరవడి సృష్టించిన నందమూరి తారక రామారావు ఆదర్శ ప్రాయుడని గిరిజన సంక్షేమ, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి చెప్పారు. ఎన్టీఆర్ వర్ధంతి సందర్భంగా శనివారం పట్టణంలోని డీలక్స్ సెంటర్‌లో గల ఎన్టీఆర్ విగ్రహానికి ఆమె పూలమాల వేసి నివాళ్లు అర్పించారు. అంతకుముందు ఎన్టీఆర్ అభిమానులు రాయల్ టైలర్, కస్తూరి రామకృష్ణ నిర్వహించిన కార్యక్రమానికి ఆమె హాజరై నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తెలుగు రాష్ట్ర రాజకీయాల్లో వినూత్న రీతిలో సంక్షేమ పథకాలు తీసుకొచ్చి పేదల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయారని చెప్పారు. కార్యక్రమంలో పట్టణ, మండల టిడిపి అధ్యక్షులు నిమ్మాది తిరుపతిరావు, ఆముదాల పరమేష్, కౌన్సిలర్లు వి.హర్షవర్ధన్, వైదేహి కృష్ణ, పట్టణ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


సాలూరు రూరల్ :మండలంలోని మామిడిపల్లి, శివరాంపురం, పెదపదం, తోణాంలో ఎన్టీఆర్ వర్ధంతిని టిడిపి నాయకులు ఘనంగా నిర్వహించారు. మండల టిడిపి అధ్యక్షుడు అముదాల పరమేశ్, నియోజవర్గ తెలుగు రైతు సంఘం అధ్యక్షులు బూస తవుడు మాట్లాడుతూ ఎన్టీఆర్ ఒక వ్యక్తి కాదని ఆయన ఒక సమ్మోహన శక్తిని కొనియాడారు. కార్యక్రమంలో మండల టిడిపి నాయకులు మత్స్య శ్యామ్, త్రినాథ్, తిరుపతి రావు, వెంకటరమణ, భాస్కరరావు, కృష్ణ, శ్రీను పాల్గొన్నారు.

పార్వతీపురం టౌన్ : కీర్తిశేషులు, మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు నటుడిగా ఉన్నత శిఖరాలకు ఎదిగి, రాష్ట్ర రాజకీయాల్లోకి వచ్చి ప్రజా సంస్కరణలు తెచ్చి దేశ రాజకీయాల్లోనే మార్పులు తీసుకొచ్చిన మహానుభావుడని స్థానిక ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర అన్నారు. ఎన్టీ రామారావు వర్ధంతిని పురస్కరించుకొని స్థానిక పాత బస్టాండ్ కూడలి వద్ద ఉన్న ఆయన విగ్రహానికి టిడిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులతో కలిసి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. చరిత్ర ఉన్నంత వరకు ఎన్టీ రామారావును ఎవరు మరువలేరని అన్నారు. కార్యక్రమంలో పట్టణ టిడిపి నాయకులు బార్నాల సీతారాం, మజ్జి వెంకటేష్, కౌన్సిలర్లు కోరాడ నారాయణరావు, తాతపూడి వెంకట్రావు, పొట్నూరు దివ్య, నాయకులు సిరిపురపు భాస్కరరావు, కోలా మధు, సారిక గణేష్, రాపాకి అనంత,డాక్టర్ భాను ప్రసాద్, సుంకరి ప్రసాద్, వారణాసి నాగరాజు, పాలకొండ మరియదాసు, పాలకొండ రాజశేఖర్, జొన్నాడ శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

నందమూర్తి సేవా సంఘం ఆధ్వర్యాన

పట్టణంలోని నందమూరి సేవా సంఘం ఆధ్వర్యాన ఎన్టీయార్ వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్టీయార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళ్లు అర్పించారు. కార్యక్రమంలో పట్టణ టిడిపి అధ్యక్షులు యడ్ల శ్రీను, కార్యదర్శి శెట్టి నారాయణ, కార్యవర్గ సభ్యులు బూర్లి వెంకటేశ, రౌతు చిన్న, తోట నాగరాజు, మక్కువ కిషోర్, ముట్నూరు వెంకటరమణ (బుజ్జిబాబు), పాకల సన్యాసిరావు, కోలా శ్రీకాంత్, సింగిరెడ్డి జైపాల్ పాల్గొన్నారు.


కురుపాం : టిడిపి వ్యవస్థాపకులు నందమూరి తారక రామారావు ఆశయాలు ఆదర్శనీయమని ఎమ్మెల్యే తోయిక జగదీశ్వరి అన్నారు. ఎన్టీఆర్ వర్ధంతి సందర్భంగా స్థానిక గాంధీనగర్ జంక్షన్ వద్ద గల ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల లేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రంలో రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల టిడిపి కన్వీనర్ కెవి కొండయ్య, నాయకులు కోలా రంజిత్ కుమార్, డొంకాడ రామకృష్ణ, జివి రమణమూర్తి, చందక రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.



ఎన్‌టిఆర్‌కు నివాళులర్పిస్తున్న పార్వతీపురం ఎమ్మెల్యే విజయచంద్ర

ఎన్‌టిఆర్ వర్ధంతి రోజున విజయోత్సవ ర్యాలీ?

సాలూరు: ఎన్టీఆర్ వర్ధంతి రోజున సాక్షాత్తూ గిరిజన సంక్షేమ, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సంధ్యారాణి ఆధ్వర్యాన విజయోత్సవ ర్యాలీ మాదిరిగా ప్రదర్శన చేయడంపై ప్రజలు ఆశ్చర్యానికి గురయ్యారు. కొంతమంది టిడిపి నాయకులు, కార్యకర్తలు కూడా కేరింతలు కొడుతూ వాహనాలపై ర్యాలీగా నివాళులర్పించేందుకు రావడం చర్చనీయాంశమైంది. మంత్రి సంధ్యారాణి పార్టీ జెండాలను ఊపుతూ టాప్ లేని కారులో చిరుమందహాసంతో రావడం మరింత చర్చకు దారితీసింది. ఎన్టీయార్ వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళు లర్పించిన తర్వాత ఆయన సేవలను కొనియాడాలి. కానీ విజయోత్సవ ర్యాలీ మాదిరిగా ప్రదర్శన చేసుకుంటూ నివాళు లర్పించడానికి మంత్రి సంధ్యారాణితో సహా నాయకులు, కార్యకర్తలు తరలిరావడంపై రిపబ్లికన్ పార్టీ రాష్ట్ర నాయకులు గొంప ప్రకాశరావు తీవ్రంగా తప్పుపట్టారు.టిడిపి వ్యవస్థాపక అధ్యక్షుడైన ఎన్టీఆర్ వర్ధంతి సందర్భంగా ఇలాంటి నివాళు లర్పించడం ఎక్కడా చూడలేదని ఆయన వ్యాఖ్యానించారు.




ఎన్‌టిఆర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న పాలకొండ ఎమ్మెల్యే జయకృష్ణ

పాలకొండ : ఎన్టీయార్ వర్ధంతి సందర్భంగా స్థానిక ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ నివాళ్లు అర్పించారు. స్థానిక దుర్గగుడి వద్ద ఉన్న ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళు లర్పించారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు కర్నెన అప్పలనాయుడు, మండల టిడిపి అధ్యక్షులు గండి రామినాయుడు, పట్టణ అధ్యక్షులు గంటా సంతోష్, నగర పంచాయతీ చైర్మన్ పల్లా ప్రతాప్, వెన్న శ్రీనివాసరావు చేబోతుల లక్ష్మీనారాయణ తమ్మారావు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

వీరఘట్టం : మండలంలో మాజీ ముఖ్యమంత్రి ఎన్టీఆర్ వర్ధంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఎన్టీఆర్ చిత్రపటానికి సర్దార్ గౌతు లచ్చన్న జలాశయం ప్రాజెక్టు మాజీ చైర్మన్ నిమ్మక పాండురంగ పూలమాలలు వేసి నివాళు లర్పించారు. కార్యక్రమంలో ఎన్‌డిఎ కూటమి నాయకులు పొదిలాపు కృష్ణమూర్తి నాయుడు, ఉదయాన ఉదయ భాస్కర్, జామి లక్ష్మీనారాయణ, బల్ల హరిబాబు, ఎ.కుమారస్వామి, చింత ఉమామహేశ్వరరావు, ఎన్.శశి కుమార్, ఎ.కృష్ణ, ఆర్.రత్నాకర్, లింగాల చంటి, వి.భాస్కరరావు, బి నీలకంఠం నాయుడు, జి గౌరు నాయుడు, ఆర్ నవీన్ కుమార్, జనసేన జానీ, ఎం.పుండరీకం, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎన్‌టిఆర్ విగ్రహాన్ని ఆవిష్కరించిన ఎమ్మెల్యే

గుమ్మలక్ష్మీపురం :మండలంలోని ఎల్విన్‌పేట కూడలి వద్ద నిర్మించిన ఎన్‌టిఆర్ విగ్రహాన్ని స్థానిక ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి ఆవిష్కరించారు. ఎన్‌టిఆర్ వర్ధంతి సందర్భంగా ఈ విగ్రహాన్ని ఏర్పాటు చేసినట్లు ఆమె తెలిపారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు పాడి సుదర్శన్ రావు, అరకు పార్లమెంట్ ఎస్‌టి సెల్ అధికార ప్రతినిధి నందివాడ కృష్ణబాబు, జనసేన నియోజకవర్గ సమన్వయకర్త కద్రక మల్లేశ్వరరావు, నియోజకవర్గ ఎస్‌టి సెల్ ప్రధాన కార్యదర్శి అడ్డాకుల నరేష్, నాయకులు పద్మావతి, శంకర్రావు, వెంకట్రావు, సుధా, కామేశ్వరరావు, జయంత్, దాసు, రమేష్, ఆనంద్, ఇతిష్, చలపతిరావు, రామకృష్ణ, సిబేశ్వరరావు, మన్మధ, రామారావు తదితరులు పాల్గొన్నారు.




ఎన్‌టిఆర్‌కు నివాళులర్పిస్తున్న కురుపాం ఎమ్మెల్యే జగదీశ్వరి

పేదలకు పళ్లు, రొట్టెలు పంపిణీ

కొమరాడ: ఎన్‌టిఆర్ వర్ధంతి సందర్భంగా శనివారం మండల కేంద్రంలో టిడిపి మండల అధ్యక్షులు, కాపు కార్పొరేషన్ డైరెక్టర్ సేనపతి శేఖర్ పాత్రుడు ఆధ్వర్యంలో వృద్ధులు, మహిళలకు, వస్త్రాలు, పళ్ళు, రొట్టెలు పంపిణి చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర సెక్రటరీ సుదర్శన రావు, రైతు అధ్యక్షులు దేవకోట వెంకట నాయుడు, టిడిపి నాయకులు మధుసూదన రావు, పొట్నూరు వెంకట నాయుడు, బురిడీ వేణు జనసేన నాయకులు తెంటు శ్రీకర్, గార గౌరి శంకర రావు తదితరులు పాల్గొన్నారు.

పాచిపెంట: మండలంలోని కొత్తవలసలో ఎన్టీఆర్ చిత్రపటానికి టిడిపి నాయకులు మతల బలరాం, మాదిరెడ్డి తులసీరామ్, దత్తి పైడిపునాయుడు, లంకెన రమేష్ పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పేదలకు తువ్వాల్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు కొత్తల పోలినాయుడు, మాదిరెడ్డి తిరుపతిరావు, గండి అప్పలస్వామి, కోడి చిన్న, బొంగు అప్పలనాయుడు, మాదిరెడ్డి మధ్యరావు తదితరులు పాల్గొన్నారు.



పాచిపెంటలో పేదలకు దుస్తులు అందజేస్తున్న టిడిపి నాయకులు


సిబ్బందికి సూచనలిస్తున్న ప్రత్యేకాధికారి కరుణాకర్

సంపద తయారీ కేంద్రం పరిశీలన

ప్రజాశక్తి - సీతానగరం

పెదబోగిలి మేజర్ పంచాయతీ పరిధిలోగల చెత్త నుంచి సంపద తయారీ చేసే కేంద్రాన్ని మండల ప్రత్యేక అధికారి కేకే కరుణాకర్ శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సేకరిస్తున్న తడి, పొడి చెత్తను వేరువేరుగా చేసి వాటి ద్వారా వచ్చిన ఆదాయాన్ని ఆ పంచాయతీకి వినియోగించుకోవడానికి ఇవ్వాలన్నారు. దీనిపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని రైతులకు కూడా వీటిని అమ్మి ఆర్థిక వనరులను సేకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి కె.కె. కుమార్‌వర్మ, ఇఒ ఈ రమేష్ పాల్గొన్నారు.

ప్రభుత్వ నిర్ణయంపై వీరేష్ చంద్రదేవ్ హర్షం

ప్రజాశక్తి - కురుపాం

సర్దార్ గౌతు లచ్చన్న తోటపల్లి ప్రాజెక్టు కుడి, ఎడమ కాలువలపై మినీ హైడల్ ప్రాజెక్టు నిర్మాణానికి రాష్ట్ర కేబినెట్ ఆమోదం హర్షించదగ్గ విషయమని టిడిపి రాష్ట్ర కార్యదర్శి వైరిచర్ల వీరేశ్ చంద్ర దేవ్ అన్నారు. ఈ సందర్భంగా శనివారం ఆయన మాట్లాడుతూ సిఎం నారా చంద్రబాబునాయుడు అధ్యక్షతన శుక్రవారం జరిగిన రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో వివిధ ప్రతిపాదనలకు ఆమోదం తెలిపారని, దీంతో పార్వతీపురం మన్యం జిల్లాలో తొలి హైడల్ ప్రాజెక్టుగా ఇది రికార్డు సృష్టించిందన్నారు. తద్వారా ఉమ్మడి విజయనగరం జిల్లా ప్రజలు, రైతుల విద్యుత్ సమస్యలకు చెక్ పెట్టవచ్చని రాష్ట్ర ప్రభుత్వం ఆలోచన వ్యక్తం చేసింది. ఈ చారిత్రాత్మక నిర్ణయం కురుపాం నియోజకవర్గంతో పాటు పార్వతీపురం మన్యం జిల్లాలో నూతన అధ్యాయం సృష్టించనుందని తెలిపారు.

పోరాటానికి సిద్ధం కావాలి

ప్రజాశక్తి - కురుపాం

మన్యం జిల్లాలో నకిలీ ఎస్టీ కులధ్రువీకరణ పత్రాలు పొందిన వారిపై పోరాటానికి గిరిజన సంఘాలు సిద్ధం కావాలని ఆదివాసీ జెఎసి చైర్మన్ కొండగొర్రి ధర్మరావు పిలుపునిచ్చారు. మండలంలోని మెండెంఖల్‌లో సర్పంచ్ ఇంటికుప్పల గౌరీశంకర్, పీసా ఉపాధ్యక్షులు ఇంటికిప్పల రామకృష్ణారావు అధ్యక్షతన నకిలీ ఎస్టీల పోరాటంపై శనివారం సమావేశం నిర్వహించారు. ఐక్య పోరాటంతోనే రాజ్యాంగబద్ధమైన హక్కులు కాపాడుకోగలగుతామని అన్నారు. కార్యక్రమానికి ఆదివాసి జెఎసి వైస్ చైర్మన్ రోబ్బా లోవరాజు, సీతారాం, మల్లయ్య, చంద్రశేఖర్, మాజీ ఎంపిపి హిమారిక నీలకంఠం, బిడ్డిక రామారావు, గుడారి వైకుంఠరావు, రాసపండు, పువ్వుల అప్పన్నదొర, నిమ్మల వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

'పాలవలస'కు ప్రముఖుల పరామర్శ

ప్రజాశక్తి - పాలకొండ

వైసిపి సీనియర్ నేత, జిల్లా పరిషత్ మాజీ అధ్యక్షులు పాలవలస రాజశేఖరం మృతి చెందిన విషయమై పలువురు ప్రముఖులు శనివారం ఆయన కుటుంబ సభ్యుల్ని పరామర్శించారు. శ్రీకాకుళం జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ పిరియా విజయ, మాజీ ఎమ్మెల్యేలు బొత్స అప్పలనర్సయ్య, కంబాల జోగులు, రాజశేఖరం చిత్రపటానికి నివాళులర్పించి ఎమ్మెల్సీ విక్రాంత్ పరామర్శించారు. మాజీ ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులునాయుడు, శ్రీకాకుళం రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ జగన్మోహన్, ఎచ్చెర్ల మాజీ ఎమ్మెల్యే నీలకంఠం నాయుడు, శ్రీకాకుళం ఉమ్మడి జిల్లా జనసేన అధ్యక్షులు పిసిని చంద్రమోహన్, జిల్లా ఉపాధ్యక్షులు గర్భాన సత్తిబాబు, ఎపి ఎన్జీవో రాష్ట్ర సహ అధ్యక్షులు చౌదరి పురుషోత్తమ నాయుడు, జిల్లా అధ్యక్షులు హనుమంతు సాయిరాం, జిల్లా కార్యదర్శి తెల్ల శ్రీను, డివిజన్ గౌర అధ్యక్షులు లిల్లీ పుష్పనాదం, జిల్లా సహాధ్యక్షులు జై రామ్, పూర్ణచంద్రరావు, పైల ఈశ్వరరావు, రమేష్ కుమార్ విక్రాంత్‌కు పరామర్శించారు.

ప్రశాంతంగా నవోదయ ప్రవేశ పరీక్ష

ప్రజాశక్తి - వీరఘట్టం

స్థానిక జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో శనివారం నిర్వహించిన జవహర్ నవోదయ ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా జరిగింది. ఈ పరీక్షకు 249 మంది విద్యార్థులు హాజరు కావలసి ఉన్నప్పటికీ 224 మంది హాజరయ్యారని, 25 మంది విద్యార్థులు హాజరు కాలేదని, పరీక్షా కేంద్రం సూపరింటెండెంట్ జి.శ్రీనివాసరావు తెలిపారు. పరీక్ష కేంద్రాన్ని నవోదయ ప్రిన్సిపాల్ డి.పరశురామయ్య, తహశీల్దార్ సిహెచ్ సత్యనారాయణ, ఎంఇఒ-2 ఆర్ ఆనందరావు, ఎంఆర్ఐ ఎన్ లక్ష్మంనాయుడు, సిఎల్‌ఒలు అరవింద్ కుష్వా, బైరాం పటేల్ పరిశీలించారు.


వైద్య శిబిరంలో మాట్లాడుతున్న మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ శశికుమార్

డ్రైవర్లకు ఆరోగ్య పరీక్షలు

ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్

రహదారి భద్రతా మాసోత్సవాలలో భాగంగా జిల్లా రవాణా శాఖాధికారి ఆధ్వర్యంలో 400మంది డ్రైవర్లకు (ఆటో, మాక్సీ, క్యాబ్, లారీ) జిల్లా వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది సహకారంతో ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసినట్టు మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ ఎం.శశి కుమార్ తెలిపారు. వాహన డ్రైవర్లు తమ ఆరోగ్యం పట్ల జాగ్రత్త వహించాలని సూచించారు. డ్రైవర్లకు ట్రాఫిక్ సిగ్నల్స్, రోడ్ ప్రమాదాలు, అధిక ప్రయాణికులతో ప్రయాణం, హెల్మెట్ ధారణ, ఓవర్ స్పీడ్ ఇతర రహదారి భద్రతపై అవగాహన కల్పించారు. డ్రైవర్లకు కంటి, బిపి, షుగరు, శారీరక దృఢ పరీక్షలు నిర్వహించామని పేర్కొన్నారు. సమస్యలున్న వారికి వైద్య శాఖ సిబ్బంది మందులను ఉచితంగా ఇచ్చామని తెలిపారు. కార్యక్రమంలో అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ జి.సీతారాం, జి.సత్య నారాయణ, ఎన్. రమేష్, బి కాశీరాం నాయక్, వైద్యాధికారులు, పాల్గొన్నారు.

గాంద్ర చెక్‌డ్యామ్‌ను అభివృద్ధి చేయాలి

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

మండలంలోని లోవముఠా ప్రాంతం దుడ్డు ఖల్లు పంచాయతీ సమీపంలో ఉన్న గాంద్ర చెక్ డ్యామ్‌ను అభివృద్ధి చేసి పంట పొలాలకు సాగునీరు అందించాలని జిల్లా బిజెపి ఎస్‌టి మోర్చా అధ్యక్షులు నిమ్మక సింహాచలం కోరారు. గాంద్ర చెక్ డ్యామును ఆయన పరిశీలించారు. చెక్ డ్యామ్ నిర్మించి 30 ఏళ్లు దాటిందని, సుమారు 1500 ఎకరాలుకు సాగు నీరు అందించవచ్చని ఆయన అన్నారు. గత వైసిపి ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగా చెక్ డ్యామ్ అభివృద్ధి లేకుండా పోయిందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందని స్థానిక ఎమ్మెల్యే జగదీశ్వరి చొరవ చూపి చెక్ డ్యామ్‌ను అభివృద్ధి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు తాడంగి లక్ష్మణరావు, గిరిజన రైతులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం

ప్రజాశక్తి - సాలూరు

స్వర్ణ ఆంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని రాష్ట్ర స్త్రీ, శిశు, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి పట్టణంలోని శనివారం శ్రీకారం చుట్టారు. ఈమేరకు మంత్రి చీపురు పట్టి రహదారులను శుభ్రం చేశారు. అనంతరం స్థానిక బాలికల ఉన్నత పాఠశాల ఆవరణలో కలుపు మొక్కలను తొలగించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఈ కార్యక్రమంపై ప్రజల్లో పెద్ద ఎత్తున అవగాహన కల్పించాలన్నారు. స్వర్ణ ఆంధ్ర - స్వచ్ఛ ఆంధ్రలో భాగంగా ఎక్కడా అపారిశుధ్యం ఉండకుండా మంచి ఆరోగ్యవంతమైన పరిసరాలు ఏర్పాటు చేసుకోవడం మన బాధ్యత అన్నారు. చెత్త కుప్పల తొలగింపు, తాగు నీటి వసతుల క్లోరినేషన్, మురుగు కాలువలు శుభ్రం చేయడం, చెరువుల వద్ద చెత్త లేకుండా చూడడం, సామాజిక మరుగుదొడ్లను గుర్తించడం - ఉపయోగంలోకి తీసుకురావడం, ఇంటింటా తడిచెత్త - పొడిచెత్త ప్రక్రియ కొనసాగించడం వంటి కార్యక్రమాలు చేపట్టాలని ఆమె పేర్కొన్నారు. అన్ని గ్రామ పంచాయతీలు బహిరంగ మలవిసర్జన రహిత పంచాయతీలుగా మారాలని ఆమె విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ర్యాలీ నిర్వహించి, మానవహారాన్ని చేపట్టారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఎస్ ఎస్ శోబిక, ఐటిడిఎ పిఒ అశుతోష్ శ్రీవాస్తవ, డిపిఒ టి.కొండలరావు, జిల్లా వ్యవసాయ అధికారి కె.రాబర్ట్ పాల్, మున్సిపల్ కమిషనర్ సిహెచ్ సత్యనారాయణ, తహశీల్దార్ ఎన్ వి రమణ తదితరులు పాల్గొన్నారు.

పార్వతీపురం టౌన్: స్వచ్ఛ పరిసరాలు లక్ష్యంగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని స్థానిక ఎమ్మెల్యే విజయ్ చంద్ర పిలుపునిచ్చారు. స్వచ్ఛ ఆంధ్ర స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో భాగంగా స్థానిక నెహ్రూ మార్కెట్ వద్ద ఆయన స్వచ్ఛత కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ప్రారంభించి, చీపురు చేత పట్టి చెత్తను ఊడ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ బోను గౌరీశ్వరి, మున్సిపల్ కమిషనర్ జి.శ్రీనివాసరాజు, అధికారులు, టిడిపి నాయకులు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

కురుపాం : స్థానిక గాంధీనగర్ జంక్షన్ నుంచి బస్టాండ్ స్వచ్ఛ ఆంధ్ర - స్వచ్ఛ దివాస్ నినాదాలతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి మాట్లాడుతూ స్వచ్ఛ ఆంధ్రగా తీర్చిదిద్దడానికి ప్రతి ఒక్కరూ పాటుపడాలని అన్నిచోట్లా పరిశుభ్రత కార్యక్రమాలు చేపట్టాలని అన్నారు. కార్యక్రమంలో డ్వామా పీడీ రామచంద్రరావు, ఆర్‌డబ్ల్యుఎస్ డిఇ నాగేశ్వరావు, ఇఒపిఆర్‌డి జె.రమేష్ బాబు, సిడిపిఒ కె.విజయ్‌గౌరి, ఐసిడిఎస్ సిబ్బంది, ఎంఇఒ రాధాకృష్ణమూర్తి, ఎంపిడిఒకార్యాలయ సిబ్బంది, వివిధ శాఖల అధికారులు, టిడిపి నాయకులు కోలా రంజిత్ కుమార్, డొంకాడ రామకృష్ణ, కెవి కొండయ్య, జివి రమణమూర్తి, చందక రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సీతానగరం : మండలంలోని పలు గ్రామాలలో స్వచ్ఛభారత్ ర్యాలీలు నిర్వహించారు. ఈ సందర్భంగా చినభోగిలిలో తహశీల్దార్ మాట్లాడుతూ ప్రభుత్వం చేపట్టిన ఈ కార్యక్రమానికి ప్రజలు భాగస్వామి కావాలని, మన చుట్టుపక్కల పరిశుభ్రతను పాటించాలని అన్నారు. కార్యక్రమంలో ఇన్‌ఛార్జి ఇఒ


సాలూరు: చీపురుతో తుడుస్తున్న మంత్రి సంధ్యారాణి, జెసి, అధికారులు

రమేష్, ఇఒపిఆర్‌డి కెకె కుమార్ వర్మ, ఎఒ ఎంఎస్ఎన్ ప్రసాద్, ఎంపిడిఒ పి.త్రివిక్రమారావు, పంచాయతీ కార్యదర్శులు పి.తిరుపతిరావు, పి.మురళీకృష్ణ, శ్రీనివాసరావు, కామేశ్వరరావు సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పాలకొండ: స్వచ్ఛమైన పరిశుభ్రత పట్టణంగా తీర్చదిద్దుదామని స్థానిక ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ అన్నారు. నగర పంచాయతీలో స్వచ్ఛ ఆంధ్ర, స్వచ్ఛ దివస్ కార్యక్రమాన్ని చేపట్టారు. కోటి దుర్గా ఆలయ జంక్షన్ దగ్గర మానవహారం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో నగర పంచాయతీ చైర్మన్ పల్లా ప్రతాప్ కమిషనర్ సర్వేశ్వరరావు, టిడిపి సీనియర్ నాయకులు కర్నేని అప్పలనాయుడు, మండల, పట్టణ టిడిపి అధ్యక్షులు గండి రామి నాయుడు, గంట సంతోష్ కుమార్ తదితరులు ఉన్నారు.

సాలూరు రూరల్ : స్వచ్ఛ ఆంధ్ర స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో భాగంగా మామిడిపల్లిలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా పంచాయతీ అధికారి కొండలరావు ప్రజలు ఆరోగ్యంగా ఉండేలా వైద్య సిబ్బంది చూసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి వై.సత్యంనాయుడు, స్థానిక సర్పంచ్ సువ్వాడ శశికళ, తెలుగు రైతు అధ్యక్షులు బూస తవుడు, టిడిపి నాయకులు తాడుతూరి తిరుపతిరావు, సచివాలయం సిబ్బంది, ఆశాలు, అంగన్వాడీ కార్యకర్తలు, పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

సీతంపేట : మండల కేంద్రంలో స్వచ్ఛ ఆంధ్ర స్వచ్ఛ దివాస్ ర్యాలీ మండల ప్రత్యేక అధికారి అహ్మద్ గయాసుద్దీన్ ఆధ్వర్యంలో మెయిన్ రోడ్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని నినాదాలు చేశారు. కార్యక్రమంలో ఏవో మాస, సర్పంచ్ కళావతి, పంచాయతీ కార్యదర్శి రామకష్ణ, తదితరులు పాల్గొన్నారు

పార్వతీపురంరూరల్: స్వచ్ఛ ఆంధ్ర, స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో భాగంగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి ఎస్.భాస్కరరావు బందలుప్పి పిహెచ్‌సిని సందర్శించి పరిసరాలను పరిశుభ్రం చేశారు. కార్యక్రమంలో జిల్లా నోడల్ అధికారి డాక్టర్ ఎం. వినోద్ కుమార్, సీసీ శ్రీనివాసరావు, పిహెచ్‌సి వైద్యులు డాక్టర్ ఎన్ఎంకె తిరుమల ప్రసాద్, డాక్టర్ పి.శ్రీకాంత్, శ్రీరాములునాయుడు తదితరులు పాల్గొన్నారు.

పాచిపెంట: పరిసరాల పరిశుభ్రత మనందరి బాధ్యత అని మండల ప్రత్యేకాధికారి, జిల్లా మైక్రో ఇరిగేషన్ అధికారి వి రాధాకృష్ణ అన్నారు. పాచిపెంటలో ఏర్పాటు చేసిన స్వచ్ఛ ఆంధ్ర స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో ఆయన పాల్గొని మానవహారం నిర్వహించి ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ పి సంతోషి, పిన్నింటి ప్రసాద్ బాబు, ఎంపిటిసి దండి ఏడుకొండలు, వైద్యాధికారి సురేష్ చంద్ర దేవ్, గ్రామ కార్యదర్శి నవీన్, ఆశ, అంగన్వాడి, సచివాల సిబ్బంది పాల్గొన్నారు.

గుమ్మలక్ష్మీపురం: మండల కేంద్రంలో జరిగిన స్వచ్ఛ ఆంధ్ర - స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి పాల్గొన్నారు. ఎల్విన్ పేట కూడలిలో అధికారులు, సిబ్బంది, ప్రజలతో కలిసి మానవహారం నిర్వహించారు. స్వచ్ఛ ఆంధ్ర - స్వచ్ఛ దివస్ ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి ధర్మారావు, మండల కన్వీనర్ పాడి సుదర్శన రావు, కార్యకర్తలు, పంచాయతీ కార్యదర్శి ఆరిక నరేష్, సచివాలయ, ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.

వీరఘట్టం: మండలంలోని చిన్నగోర కాలనీలో శనివారం సచివాలయ కార్యదర్శి కే సునీల్ కుమార్ ఆధ్వర్యంలో స్వచ్ఛ ఆంధ్ర స్వచ్ఛ దివస్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వీధుల్లో మురుకు కాలువలో చెత్తను తొలగించారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

పార్వతీపురంరూరల్: స్వర్ణ ఆంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం మండలంలోని అన్ని పంచాయతీలలో నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా ముందుగా పెదబొండపల్లిలో డిఎల్‌డిఒ రమేష్ రామన్, ఇఒపిఆర్‌డి రమణమూర్తి ఆధ్వర్యంలో పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించి ప్రతి మూడో శనివారం స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాల్లో పాల్గొంటామని గ్రామస్తులచే ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమాల్లో గ్రామ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

స్వచ్ఛ ఆంధ్ర - స్వచ్ఛ దివస్ ప్రచారానికి పరిమితం కాకూడదు : సిపిఎం

పాలకొండ : స్వచ్ఛ ఆంధ్ర - స్వచ్ఛ దివస్ కార్యక్రమం ప్రచార ఆర్భాటాలకు పరిమితం కాకూడదని, నగర పంచాయతీ పరిధిలో వార్డుల వారీగా సభ ఏర్పాటు చేసి, సంపూర్ణ పారిశుధ్య నివారణకు తగు చర్యలు తీసుకోవాలని సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు దావాల రమణారావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ మేరకు సిపిఎం ప్రతినిధి బృందం బుట్టిమఠం కాలనీ, యానాదుల వీధుల్లో పర్యటించింది. ఈ సందర్భంగా రమణారావు మాట్లాడుతూ పాలకొండ నగర పంచాయతీ రోజురోజుకు విస్తరిస్తుందని, పెరుగుతున్న జనాభా అనుగుణంగా పారిశుధ్య కార్మికుల సంఖ్య లేరని, ఇంటింటి చెత్త సేకరణ బిన్నుల్లో వేయడానికి సుమారు 40 బిన్నులు అవసరమని, ఎక్కడ చెత్త అక్కడే రోడ్లపై ఉంటుందని అన్నారు. డంపింగ్ యార్డ్ సమస్య శాశ్వత పరిష్కారానికి నేటికీ జాప్యం జరుగుతుందని అన్నారు. మురికి కాలువల్లో నీరు ఎక్కడికక్కడ నిల్వ ఉండడం వల్ల ప్రజలు అనారోగ్యం పాలవుతున్నారన్నారు. పాలకొండ నగర పంచాయతీని యూనిట్‌గా తీసుకుని డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటు చేయాలని, సంపూర్ణ పారిశుధ్య నివారణకు భౌతిక పరిస్థితులు శాస్త్రీయంగా పరిశీలించి తగు చర్యలు తీసుకోవాలని, స్వచ్ఛ ఆంధ్ర- స్వచ్ఛదివస్ కార్యక్రమం ప్రచారానికే పరిమితం కాకూడదని, ఆచరణలో చిత్తశుద్ధి చూపించాలని అన్నారు. కార్యక్రమంలో సిపిఎం దూసి దుర్గారావు, కాద రాము, ఎం.రమేష్, ఎ.లక్ష్మణరావు, తదితరులు పాల్గొన్నారు.



గుమ్మలక్ష్మీపురం: ర్యాలీ చేస్తున్న ఎమ్మెల్యే జగదీశ్వరి, అధికారులు, నాయకులు


పార్వతీపురం: చీపురతో తుడుస్తున్న ఎమ్మెల్యే బోనెల విజయ్ చంద్ర

రహదారి భద్రత నియమాలు పాటించాలి

ప్రజాశక్తి - కురుపాం

వాహనాలు నడిపే ప్రతి ఒక్కరూ మద్యపానం సేవించకుండా రహదారి భద్రత నియమాలు పాటించి వాహనాల నడపాలని నీలకంఠాపురం ఎస్ఐ నీలకంఠరావు అన్నారు. శనివారం మండలంలోని గుంజరాడ గ్రామంలో రహదారి భద్రత నియమాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రహదారి ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్న నేపథ్యంలో ప్రతి ఒక్కరూ వాహనాన్ని రహదారి భద్రతా నియమాలు పాటించి నడపాలని, ద్విచక్ర వాహనం నడిపేవారు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, వేగం కన్నా ప్రాణం మిన్న అని చెప్పారు. ఈ కార్యక్రమంలో కానిస్టేబుళ్లు, గ్రామస్తులు పాల్గొన్నారు.

హెల్మెట్ తప్పనిసరి

గరుగుబిల్లి: వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని ఎస్ఐ పి.రమేష్‌నాయుడు అన్నారు. శనివారం మండలంలోని నందివానివలస జంక్షన్ వద్ద వాహనదారులకు హెల్మెట్ వాడకం పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హెల్మెట్ ధరించడం వల్ల రోడ్డు ప్రమాదాల సమయంలో ప్రాణాపాయం నుంచి బయటపడవచ్చు అన్నారు. ద్విచక్ర వాహనదారులు వాహనాలను నడిపేటప్పుడు తప్పనిసరిగా మోటార్ వెహికల్ నిబంధనను పాటించాలన్నారు. తల్లిదండ్రులు 14 సంవత్సరాల లోపు పిల్లలకు వాహనాలను ఇవ్వరాదని సూచించారు. ఈ కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ చిన్నారావు, కానిస్టేబుల్ శంకర్రావు వాహనదారులు పాల్గొన్నారు.

వీరఘట్టం: ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని ఎస్ఐ జి.కళాధర్ వాహనదారులకు సూచించారు. శనివారం మండలంలోని యు వెంకంపేట సమీప మరియగిరి జంక్షన్ వద్ద హెల్మెట్‌పై వాహనదారులకు అవగాహన కల్పించారు. అతివేగం ప్రమాదం, నిదానమే ప్రధానం, అన్నట్టుగా వాహనాలు నడపాలన్నారు. మద్యం సేవించి వాహనాలు నడపరాదని, అటువంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిబ్బందితోపాటు, వాహనదారులు పాల్గొన్నారు.

సురక్షిత ప్రయాణాలపై అవగాహన

పాలకొండ: వాహనదారులు సురక్షితమైన ప్రయాణాలు సాగించాలని ఎంవిఐ టి.వేణుగోపాల్ తెలిపారు. మండలంలోని కొండాపురం కూడలిలో శనివారం వాహనదారులకు వాహన నిబంధనలపై అవగాహన కల్పించారు. ఇటీవల కాలంలో ఎక్కువగా ప్రమాదాలు జరుగుతున్నందున ఎఅప్రమత్తంగా వాహనాలు నడపాలని సూచించారు, రేష్ డ్రైవింగ్ వద్దని, హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని సూచించారు. ఆటో డ్రైవర్లు వాహన నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని, అతివేగం పనికిరాదని అన్నారు. గమ్యస్థానాలకు వేగంగా వెళ్లాలనే ఆలోచనతో వాహనాలు నడుపుతుండడం సరికాదన్నారు. ఆటోల్లో నిబంధనలకు విరుద్ధంగా అధిక మంది ప్రయాణికులను ఎక్కించొద్దని సూచించారు. అనంతరం వాహన తనిఖీలు చేపట్టారు. కార్యక్రమంలో ఎఎంవిఐ ఎన్ నవీన్ కుమార్ ఉన్నారు.


కురుపాం: అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ నీలకంఠరావు


పాలకొండ: ఆటో డ్రైవర్లకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

హెల్మెట్ లేకుంటే ఆడలికి ప్రవేశం లేదు

సీతంపేట: హెల్మెట్ లేనిచో ఆడాలి యు పాయింట్‌కు ప్రవేశం ఉండదని ఎస్సై వై అమ్మనరావు తెగేసి చెప్పారు. మండలంలోని ధోనుబాయి జంక్షన్ వద్ద హెల్మెట్‌పై అవగాహన కల్పించారు. ఆడాలి యు పాయింట్‌కు వెళ్లాలంటే తప్పనిసరిగా హెల్మెంట్ ఉండి తీరాలన్నారు. అదేవిధంగా రోడ్డు ప్రమాదాలు గురించి వివరించారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించాలన్నారు. యువత, ప్రజలు హెల్మెట్ రక్షణ గురించి తెలుసుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో పోలీసులు తదితరులు పాల్గొన్నారు .

దర్యాప్తు చేయండి

కొమరాడ: వెలుగు ఎపిడి వై.సత్యం నాయుడు పనిచేసిన కాలంలో అభివృద్ధి పథకాల పైన దర్యాప్తు చేపట్టాలని సిపిఎం నాయకులు కొల్లి సాంబమూర్తి డిమాండ్ చేశారు. శనివారం మండల కేంద్రంలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ కలెక్టర్‌కు ఇప్పటికే ఆరుసార్లు ఫిర్యాదు చేసినా ఫలితం లేదన్నారు. ఇప్పటికైనా కలెక్టర్ జీడిపప్పు ప్రాసెసింగ్‌కి సిద్ధం కావాలని అధికారులకు చెప్పడం శుభపరిణామని ఇదే స్ఫూర్తితో వెలుగు ఎపిడి పనిచేసిన కాలంలో వచ్చిన కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ నిధులతో పాటు అభివృద్ధి పదంలో ఖర్చుపెట్టే ప్రతి పైసా పై వెంటనే దర్యాప్తు చేపట్టాలని కోరారు. ముఖ్యంగా వన్ దన్ కేంద్ర ప్రభుత్వం నుండి వచ్చిన నిధులు పైన ఎంత ఖర్చు పెట్టారు? ఏ విధంగా ఖర్చు పెట్టారు? ఇంకా బ్యాంకుల్లో మూలుగుతున్న సొమ్ము ఎంత ఈ నిధుల వల్ల గిరిజన మహిళలకు ఎంతవరకు ఉపయోగ పడదనే విషయం పైన విచారణ చేపట్టాలని కోరారు. రావికాని గ్రామానికి సంబంధించిన 35 మంది మహిళ గ్రూపులకు సంబంధించి మహిళలతో అడ్డూరవలస గ్రామంలో కుట్టు మిషన్ ట్రైనింగ్ ఇచ్చి మిషన్లు ఇస్తామని ఇవ్వలేదన్నారు. 35మందికి రోజుకు ఇస్తామన్న రూ.500 కూడా ఇప్పటికీ ఇవ్వలేద న్నారు. వెంటనే దర్యాప్తు చేపట్టి ఇప్పటికైనా నిజాలు తేల్చాలని కోరారు. ఈ సమావేశంలో గిరిజన సంఘం నాయకులు రామారావు ఉన్నారు.

గిరిజనుల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి : మంత్రి

ప్రజాశక్తి- సాలూరు

గిరిజనుల అభివృద్ధిపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టిందని రాష్ట్ర మహిళా శిశు సంక్షేమ, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యా రాణి అన్నారు. శనివారం సాలూరులో చైల్డ్ ఫండ్ సౌజన్యంతో సెంటర్ ఫర్ వరల్డ్ సాలిడారిటీ స్వచ్ఛంధ సేవా సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్వచ్ఛంద సేవా సంస్థ గిరిజన పిల్లలను దత్తత తీసుకుని చదివించడం చాలా సంతోషంగా ఉందన్నారు. పిల్లలు పుట్టిన దగ్గర నుండి ఆరు సంవత్సరాల వరకు అంగన్వాడీ కేంద్రాల్లో ఉంచాలని, అంగన్వాడీ కేంద్రాల్లో ఇచ్చే పౌష్టిక ఆహారం పిల్లల్లో ఎదుగుదలకు తోడ్పడుతుందని తెలిపారు. ఆరు సంవత్సరాలు నిండిన తరువాత ప్రభుత్వ పాఠశాలకు పంపాలని, చిన్న వయసులోనే బడి వదిలి పనికి పంపిస్తే పిల్లల భవిష్యత్ పాడవుతుందని చెప్పారు. ప్రతీ అంగన్వాడీ కేంద్రానికి ప్రభుత్వం లక్ష రూపాయలు ఇస్తోందని, కేంద్రాల్లో టీవీ, తాగు నీటి సౌకర్యం, మరుగుదొడ్లు, ఆట వస్తువులు కొనుగోలుకు వీటిని వినియోగించాలని చెప్పారు. పంచాయతీల్లో అద్దె ఇంట్లో ఉండే అంగన్వాడీ కేంద్రాలను ప్రభుత్వం భవనాలకు తరలించేలా, ఖాళీ భవనాలు ఉంటే చెప్పాలని సూచించారు.


సంస్థ ద్వారా మెడికల్ కిట్లు ఇవ్వడానికి యాజమాన్యం సిద్ధంగా ఉందన్నారు. కేంద్రాలకు బాల సంజీవిని పౌడర్‌ను పంపిణి చేస్తున్నామని అది కేవలం మహిళలు మాత్రమే ఉపయోగించేలా అవగాహనా కల్పించాలని కోరారు. ఈ సందర్భంగా 94 మంది పిల్లలకు పౌష్టిక ఆహార కిట్లను, మూడు కుటుంబాలకు ఆరు మేకలు, పది పాఠశాలల్లో చదివే పిల్లలకు పుస్తకాలు, స్టడీ మెటీరియల్, అయిదు అంగన్వాడీ కేంద్రాలకు ఆట వస్తువులను అందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రామ పంచాయతీ అధికారి తమర్భ కొండలరావు, జిల్లా వ్యవసాయ అధికారి కె. రాబర్ట్‌పాల్, మున్సిపల్ కమిషనర్ సిహెచ్ సత్యనారాయణ, తహశీల్దార్ ఎన్‌వి రమణ తదితరులు పాల్గొన్నారు.


కిట్లను పంపిణీ చేస్తున్న మంత్రి సంధ్యారాణి

పక్కాగా ఆరోగ్య సర్వేలు

ప్రజాశక్తి - వీరఘట్టం

క్షేత్ర స్థాయిలో ఆరోగ్య సర్వేలు పక్కాగా చేపట్టాలని డిప్యూటీ డిఎంహెచ్ఒ డాక్టర్ కె.విజయపార్వతి, జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ టి.జగన్ మోహనరావు వైద్య సిబ్బందికి సూచించారు. ఈ మేరకు స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో కుష్టు వ్యాధిగ్రస్తులకు గుర్తించే కార్యక్రమం (ఎల్ సిడిసి సర్వే)పై నిర్వహించిన సమావేశంలో వారు పాల్గొని సర్వేకు సంబంధించి పలు సూచనలు చేశారు. ఈనెల 20 నుంచి జరగనున్న లెప్రసీ సర్వే ముందస్తు ప్రణాళికతో నిర్దేశించిన మార్గదర్శకాలను అనుసరించి పూర్తి స్థాయిలో చేపట్టాలని, గృహ సందర్శనలు చేసి కుష్టు వ్యాధి లక్షణాలున్న వారిని గుర్తించి, వివరాలను నమోదు చేయాలని ఆదేశించారు. కుష్టవ్యాధి గుర్తింపుపై అవగాహన కల్పించారు. అనంతరం పలు ఆరోగ్య కార్యక్రమాలపై సమీక్ష చేశారు. గర్భిణీ, శిశు ఆరోగ్యం పట్ల చేపడుతున్న కార్యాచరణపై సిబ్బందిని ఆరా తీశారు. క్షేత్ర స్థాయి సిబ్బంది గృహ సందర్శనలు చేసి గర్భిణీలు ఐరన్, కాల్షియం, మాత్రలు, పౌష్టిక ఆహారం సక్రమంగా తీసుకుంటున్నారా లేదా అనేది పర్యవేక్షించాలని సూచించారు. ఎన్సిడి సర్వే, స్కూల్ హెల్త్, అంగన్వాడీ స్క్రీనింగ్, సాన్స్ సర్వే లపై అడిగి తెలుసుకున్నారు. పిహెచ్సీ ల్యాబ్ తనిఖీ చేశారు. కుక్క కాటు ఇంజక్షన్ల లభ్యత పరిశీలించారు. రోగులతో మాట్లాడి ఆరోగ్య సమస్యలు అడిగి తెలుసుకున్నారు. తదుపరి పిహెచ్సీ ప్రాంగణంలో కుష్టు వ్యాధి నిర్మూలన కార్యక్రమానికి సంబంధించిన నినాదాలు చేస్తూ అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ బి.ప్రదీప్ కుమార్, జిల్లా కార్యాలయ డెమో వై.యోగేశ్వర రెడ్డి, డిఎస్ఒ శంకర్, సూపర్వైజర్లు జనార్ధనరావు, ఆదిలక్ష్మి, శాంతకుమారి, విజయనంద్, వైద్య సిబ్బది తదితరులు పాల్గొన్నారు.


కుష్టుపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

ట్యాంకర్ ఢీకొని సైక్లిస్ట్ మృతి

సీతానగరం: మండలంలోని సువర్ణముఖి నది వంతెన వద్ద శనివారం రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందారు. పోలీసులు అందించిన వివరాల మేరకు.. బల్ల కృష్ణాపురం గ్రామానికి చెందిన అక్కినేని సత్యనారాయణ (47) శనివారం ఉదయం తన సొంత పనిమీద గ్రామం నుంచి సీతానగరం సైకిల్ మీద వస్తుండగా బొబ్బిలి నుంచి పార్వతీపురం వెళుతున్న ట్యాంక్ లారీ వెనుక నుంచి ఢీ కొట్టి అతని తల మీద నుంచి వెళ్లిపోయింది. ఈ ప్రమాదంలో ఆయన తల నుజ్జునుజ్జు అయింది. దీంతో ఘటనా స్థలంలోనే ఆయన మృతి చెందాడు. భార్య రవణమ్మ కుమారుడు కిరణ్ కుమార్, కూతురు సుకన్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ ఎం. రాజేష్ తెలిపారు. మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పార్వతీపురం ఏరియా ఆసుపత్రికి తలించామన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ప్రజాశక్తి- పాచిపెంట

మండలంలోని రోడ్డు ప్రమాదంలో పెద్దగులిగూడ గ్రామానికి చెందిన కొర్ర పొట్టయ్య (40) శుక్రవారం రాత్రి మృతి చెందారు. తన ద్విచక్ర వాహనంపై తన భార్యను రాయి గుడ్డివలస పంచాయతీ పనుకువలస గ్రామం కన్నవారి ఇంటి వద్ద దించి తిరిగి అదే రోజు సాయంత్రం హైవే మీదగా తిరిగివస్తుండగా పూడిరోడ్ జంక్షన్ వద్దకు వచ్చేసరికి తను నడుపుతున్న ద్విచక్ర వాహనం అదుపు తప్పి బోల్తా పడ్డాడు. దీంతో తలకి తీవ్ర గాయమైంది. అతన్ని 108 అంబులెన్సు ద్వారా సాలూరు ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గం మధ్యలో మృతి చెందాడు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వెంకట సురేష్ తెలిపారు.

గాయపడిన వ్యక్తి మృతి

ప్రజాశక్తి - సీతంపేట

మండలంలోని ఆడలి వ్యూ పాయింట్ సమీపంలో మూడు రోజుల క్రితం ఆటో అదుపు తప్పి జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన బొడ్డు యశోదమ్మ(58) శనివారం శ్రీకాకుళంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్సై వై అమ్మనరావు తెలిపారు. ఈమెది శ్రీకాకుళం జిల్లా బూర్జ మండలం కురుంపేట. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.